క్లుప్తంగా

పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడికి జెడ్పీ చైర్మన్ పరామర్శ



లక్ష్మీకాంతంకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మామిడికుదురు: మాతృ వియోగంతో బాధపడుతున్న నగరం వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కడలి శ్రీనును జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం పరామర్శించారు. శ్రీను తల్లి కడలి లక్ష్మీకాంతం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె చిత్రపటం వద్ద వేణుగోపాలరావు పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఆయనతో పాటు పార్టీ నేతలు జక్కంపూడి తాతాజీ, అడ్డగళ్ల సాయిరామ్, నీతిపూడి చంద్రరావు, అన్వర్ తాహిర్ హుస్సేన్, నెల్లి దుర్గాప్రసాద్, తాడి రామకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు, చిక్కం బుజ్జిబాబు, కొమ్ముల చిన్న, బాలం రమేష్, తదితరులు శ్రీనును పరామర్శించారు.

వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు



ఆలయ ఆవరణలో స్వామి వారి అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు అష్టోత్తర పూజల్లో పాల్గొంటారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో స్వామి వారి అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

రహదారి నిబంధనలు పాటించాలి



ఆలమూరులో రహదారి నిబంధనలు వివరిస్తున్న ఎంవీఐ నాగేశ్వరరావు

ఆలమూరు: రహదారిపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించి ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందాలని మండపేట డివిజన్ రవాణా అధికారి (ఎంవీఐ) వై.నాగేశ్వరరావు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ వి.నరసింహస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో ఎంవీఐ నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. రహదారుల్లో ఏర్పాటు చేసిన సిగ్నల్ వ్యవస్థ పనితీరును, అనుసరించవలసిన నియమాలను వివరించారు. అనంతరం విద్యార్థులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. అధ్యాపకులు డాక్టర్ ఆశిష్‌బాబు, బాలస్వామి, మంజులత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన రామేశ్వరం జట్టుకు సత్కారం



రాష్ట్ర స్థాయి పోటీలకు వెళుతున్న రామేశ్వరం వాలీబాల్ టీంను సత్కరిస్తున్న ఎంపీపీ మల్లిబాబు

సఖినేటిపల్లి: అమలాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో స్టేట్ లెవెల్‌కు ఎంపికైన మండలంలోని రామేశ్వరం వాలీబాల్ టీంకు బుధవారం ప్రముఖులు ఘనసత్కారం చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద సదరు టీం సభ్యులకు ఎంపీపీ వీరా మల్లిబాబు శాలువాలతో సత్కరించారు. ఈ నెల 9న విశాఖపట్నంలో జరుగనున్న స్టేట్ లెవెల్ టోర్నమెంట్‌కు వెళుతున్న రామేశ్వరం జట్టుకు ఎంపీపీ మల్లిబాబు, ఎంపీడీవో బడుగు మంగాదేవి, ఎస్సై ఎస్.రాము అభినందనలు తెలిపారు. ఏపీఎం విజయ్, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు తాడి సహదేవ్, స్థానికులు పాల్గొన్నారు.



శృంగవరప్పాడులో మందు వినియోగించే విధానం తెలుపుతున్న ఏవో



మామిడికుదురులో ఎలుకల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మృదుల



ఇరుసుమండలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఏవో విజయకుమార్

సామూహిక చర్యలతోనే ఎలుకల నిర్మూలన

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన
- బ్రోమోడయోలిన్ వినియోగంపై వివరణ



ఊడిమూడిలో ఎలుకల నివారణ పద్ధతులను రైతులకు వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



కొత్తపేటలో రైతులకు ఎలుకల మందును పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

మామిడికుదురు: సామూహిక చర్యలతోనే ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందని మండల వ్యవసాయాధికారి బి.మృదుల పేర్కొన్నారు. మండలంలోని ఆర్బీకేల్లో బుధవారం రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మామిడికుదురులో జరిగిన సమావేశంలో ఏఓ మృదుల ఎలుకల మందులో నూకలు కలిపిన మిశ్రమాన్ని రైతులకు అందజేశారు. ఎకరానికి 100 గ్రాములు విషపు ఎర తయారీకి రెండు గ్రాములు బ్రోమోడయోలిన్ మందును 96 గ్రాముల నూకలు కలిపి సజీవ ఎలుకల బొరియకు 10 గ్రాముల వంతున పొట్లాలు కట్టి ఎలుకల కన్నాల్లో పెట్టాలన్నారు. రైతులు పినిశెట్టి నాగబాబు, కంచి విశ్వనాథం, తోట పాలరావు, నయినాల నాగేశ్వరరావు, కూన రాము, నయినాల వీరబ్రహ్మాజీ, బాలం రామారావు, పల్లంశెట్టి, బీఏఏ పి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: రైతులంతా ఎలుకల నివారణకు సామూహికంగా చేపట్టితే అరికట్టవచ్చని ఏఓ సిహెచ్ డి.విజయ్‌కుమార్ అన్నారు. ఎలుకల నివారణ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ బ్రోమోడయోలిన్ మందును వ్యవసాయాధికారులు సూచించిన మేరకు ఎలుకలకు ఎరగా వేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నాగబత్తుల సత్యానందరావు గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దోనబోయిన రాంబాబు, కోనపురెడ్డి వెంకట్రావు, ఏఈఓ డి.దుర్గారావు, వీఏఓ కిరణ్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: వరిలో సామూహిక ఎలుకల నిర్మూలన ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు అన్నారు. బుధవారం శృంగవరప్పాడులో సత్తెమ్మ తల్లి గుడి వద్ద వరి రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలుకల నివారణ మందు బ్రోమోడియోలిన్‌ను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కాగా మండల వ్యాప్తంగా 18 కేజీల మందును ఆయా గ్రామల్లో ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్‌లతో పంపిణీ చేయించినట్టు ఏవో పీవీ నరసింహారావు తెలిపారు. అనంతరం చేల వద్ద ఎలుకల బొరియల్లో ప్రాక్టికల్‌గా వీటి నివారణకు విషపు మందును ఉపయోగించే విధానాన్ని ఏవో రైతులకు వివరించారు. ఏఈవో రవీంద్ర, వీఏఏ, వీహెచ్ఏలు ఈశ్వరరావు, వెంకటేష్, రైతులు మాలే ఆదినారాయణ రావు, జి.సత్యనారాయణ, సీహెచ్. వెంకట నారాయణ, కొల్లాబత్తుల నరేష్, రావి ఏసుబాబు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని మార్టేరు ప్రాంతీయ పరిశోధన క్షేత్రం ఎలుకల నివారణ శాస్త్రవేత్త ఎన్.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఊడిమూడి పెదపేట వ్యవసాయం క్షేత్రం వద్ద బుధవారం ఎలుకల నివారణపై రైతులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 100 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును 5 కిలోల నూకలు, 100 గ్రాముల నూనెతో కలిపి ఎరను తయారు చేయాలన్నారు. 10 గ్రాముల వంతున ఎరను పొట్లాలుగా కట్టి ఎలుకల కలుగుల్లో పెట్టాలని సూచించారు. ఏడీఏ జేఎస్‌వీ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలకు 31 కిలోల బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశామన్నారు. డీఆర్‌సీ ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్‌కుమార్, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, సొసైటీ చైర్మన్ గిడ్డి రాంబాబు, గిడ్డి గణపతి, పందిరి పూర్ణచంద్రరావు, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న ఎలుకల నివారణ మందును రైతులు వినియోగించి ఎలుకలను నిర్మూలించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న బ్రోమోడయోలిన్ మందును రైతులకు వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. మండలంలో ఏడు వేల ఎకరాలు వరుసాగు జరుగుతుందన్నారు. ఒక హెక్టార్ కి 10 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును వినియోగించాలన్నారు. 100 గ్రాముల మిశ్రమానికి 96 గ్రాముల వరి నూకలు, రెండు గ్రాముల వంటనూనె, రెండు గ్రాముల మందు కలిపి సాయంత్రం సమయంలో ఎలుకల కన్నాల వద్ద ఉంచాలని రైతులకు సూచించారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో స్వామి కల్యాణంలో పాల్గొన్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం, అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఈదరాడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మేరికమ్మ

మామిడికుదురు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.మేరికమ్మ బుధవారం పరిశీలించారు. ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 189, 191 పోలింగ్ కేంద్రాలతో పాటు అదే గ్రామంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలలోని 190వ పోలింగ్ కేంద్రాన్ని కూడా ఎమ్మార్వో పరిశీలించారు. అక్కడ చేసిన ఏర్పాట్లను ఆమె స్వయంగా చూసి వివరాలను తెలుసుకున్నారు. కొమరాడ, ఈదరాడ గ్రామాల్లో జరుగుతున్న హౌస్ సైట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా తహసీల్దార్ పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆమె వెంట ఆర్ఐ అలీ, వీఆర్వోలు రంగ, సుబ్బరాజు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. అనంతం మండల రెవెన్యూ కార్యాలయంలో సెక్టార్ అధికారులకు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు.

చలో అసెంబ్లీకి ప్రభుత్వ అనుమతి లేదు

అయినవిల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే ఆశా వర్కర్లు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రభుత్వ అనుమతి లేదని స్థానిక ఎస్సై బి.రాజేష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వీరవల్లిపాలెంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా వర్కర్ల అందరూ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఎస్సై రాజేష్‌కుమార్ మాట్లాడుతూ గురువారం విజయవాడలో చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకూడదన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఆశా వర్కర్లు అందరూ ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాలన్నారు. చలో విజయవాడ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ఎటువంటి అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లి ఇబ్బంది పడవద్దన్నారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: తమ డిమాండ్ల సాధనకై బుధవారం చలో విజయవాడ పిలుపునిచ్చిన ఆశా వర్కర్లను ఆయా పీహెచ్‌సీల్లో పోలీసులు నిలుపుదల చేశారు. ఈ మేరకు మోరి పీహెచ్‌సీలో 32 మంది ఆశా వర్కర్లను నిలుపుదల చేశారు. వీరిలో సంఘ అధ్యక్షురాలు మోకా పుష్పకుమారి, కార్యదర్శి బి.సురేఖ, కార్యవర్గ సభ్యురాలు కుడిపూడి అమ్మాజీ తదితరులు ఉన్నారు.

రామాలయం దెబ్బతిందంటూ నిరసన



పాశర్లపూడిలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలో చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణం వల్ల శ్రీకోదండ రామాలయం దెబ్బతిందంటూ స్థానిక మత్స్యకారులు బుధవారం నిరసన తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. తక్షణం రెవెన్యూ, రైల్వే అధికారులు స్పందించి దెబ్బతిన్న రామాలయాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.

తలనీలాలకు టెండర్ కం బహిరంగ వేలం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో భక్తులు స్వామికి సమర్పించుకునే తలనీలాలు పోగుచేసుకునే హక్కుకై బుధవారం ఆలయం వద్ద టెండర్ కం బహిరంగ వేలం ఆలయ అధికారులు నిర్వహించారు. సముద్రం వద్ద, దేవాలయం వద్ద తలనీలాలు పోగు చేసుకోవడానికి వేలం పాటలో హెచ్చు పాటదారుడైన తాడేపల్లిగూడేనికి చెందిన నీలగిరి మహేష్‌కు పాట ఖరారు చేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కాగా పర్యవేక్షణ అధికారిగా బి.సావరం గ్రూపు దేవాలయాల ఈవో టి.నాగవిష్ణు వ్యవహరించారు.

నమస్తే పథకంలో నమోదు చేసుకోవాలి

అమలాపురం టౌన్: పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్లు, హెల్పర్ల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పన, సామాజిక న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్(నమేస్తే) పథకంలో సఫాయి కార్మికులంతా నమోదు కావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ సూచించారు. ఈ పథకాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. పథకంలో భాగంగా అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు అమలాపురంలో ప్రజా సైన్స్ కళా యాత్ర

అమలాపురం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథ ప్రచారంలో భాగంగా జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ప్రజా సైన్స్ కళా యాత్ర నిర్వహిస్తోందని జిల్లా జేవీవీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ఎండీ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. దీంట్లో భాగంగా ఈ నెల 9వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి అమలాపురం గడియారం స్తంభం సెంటరులో కళా జాతా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

దుష్టశక్తులతో సీఎం జగన్ పోరాటం

- చాకలిపాలెంలో రేపు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం
- మిథున్‌రెడ్డి, పొన్నాడ రాక



పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని దుష్టశక్తులు ఆయనపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నాయని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న దుష్టశక్తులపై అలుపెరుగని పోరాటం చేస్తున్న జగన్‌కు పార్టీ శ్రేణులంతా అండగా ఉండాలని అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న ఉదయం 10 గంటలకు చాకలిపాలెం కృష్ణబాలాజీ కన్వెన్షన్ హాలులో జరిగే పి.గన్నవరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పొన్నాడ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొంటారని విప్పర్తి వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు సక్కా వెంకటేశ్వరరావు, కొమ్ముల రాము, కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల శేఖర్, పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, మండల జేసీఎస్ కన్వీనర్లు దొమ్మేటి దుర్గారావు, దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



ఆలమూరులో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్ వ్యాక్సిన్లను అందజేశారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కంప్యూటరైజేషన్‌పై అవగాహన కల్పిస్తున్న డీసీఓ రాధాకృష్ణారావు

ఆత్రేయపురం: జిల్లాలో కోఆపరేటివ్ బ్యాంకుల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎ.రాధాకృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన ఆత్రేయపురం మండలం ర్యాలి రూరల్ బ్యాంక్ పనితీరును పరిశీలించారు. బ్యాంక్‌లో కంప్యూటరైజేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



నులిపురుగు నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు



ఆలమూరులో డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారుల బృందం

రావులపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మండల టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సమావేశం నిర్వహించి ఊబలంక పీహెచ్‌సీ పరిధిలోని నులిపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాత్రలు పంపిణీ ప్రణాళికపై వైద్యాధికారి శ్రీకాంత్ వివరించారు. సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసు, తహసీల్దారు డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, ఎంఈఓ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈనెల తొమ్మిదిన నిర్వహించనున్న డీ వార్మింగ్ డేను పురస్కరించుకుని ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్ అధ్యక్షతన బుధవారం సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీ అధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చల నాయుడు, డి.మల్లికార్జున్ పాల్గొని డీ వార్మింగ్ డే ఆవశ్యకతను వివరించారు. అనంతరం డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరించారు. ఎంఈఓ పి.సాలెం రాజు, సూపరింటెండెంట్ వి.రామ్‌స్వరూప్ పాల్గొన్నారు.

రేపు చొల్లంగి తీర్థం

కాట్రేనికోన: పల్లం పంచాయతీ బ్రహ్మసమేధ్యం(బ్రహ్మసూత్రం)లో సుమారు 200 ఏళ్లకు పూర్వం స్వయం సిద్ధంగా కాలభైరవుడు, బ్రహ్మేశ్వరుడు, కనదుర్గమ్మలు వెలిశారని ప్రతీతి. ఇక్కడ వెలసిన కాలభైరవస్వామి సంతానం కలగని దంపతులకు పండంటి బిడ్డను ప్రసాదించే సంతాన ప్రదాతగా పేరొందాడు. అమావాస్య రోజు సముద్ర స్నానం ఆచరించి స్వామిని దర్శించుకుంటే సకల పాపాల నుంచి విమోచనం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ నెల 9వ తేదీ శుక్రవారం చొల్లంగి తీర్థం జరగనున్న నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

స్వయం భువుడు కాల భైరవుడు

బ్రహ్మసమేధ్యంలో భక్తులు కోరిన కోర్కెలను తీరుస్తూ సంతానమూర్తిగా వెలసిన కాలభైరవుడు స్వయం భువుడు. సుమారు 200 ఏళ్ల క్రితం స్థానిక మత్స్యకారులు చేపల వేట చేస్తున్న సమయంలో కాలభైరవుడు, పార్వతీ సమేత బ్రహ్మేశ్వరుడి(బ్రహ్మసూత్రం) ప్రతిమలు వలలో చిక్కుకున్నాయి. వారికి ఆలయాలు నిర్మించి స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ఏటా చొల్లంగి అమావాస్య రోజున ఉత్సవాలు చేస్తున్నారు. పల్లం, నీళ్లరేవు, చిర్రయానం, కొత్తపాలెం, మొల్లేటిమొగ తదితర గ్రామాల ప్రజలు ఆలయానికి చేరుకుని స్వామికి ఇష్టమైన క్షీరాన్నంను నైవేద్యంగా పెడతారు. తుపాను ప్రభావంతో తాడి చెట్టు ఎత్తున్న సముద్రం ఎగసిపడి వస్తున్నపుడు స్వామి సముద్రానికి ఎదురుగా శిలపై కూర్చుని దంత దావనం చేసుకున్నాడని, సముద్రం వెనుదిరిగి వెళ్ళిపోయిందని పెద్దలు చెబుతారు. దీనికి గుర్తుగా ఆలయం ఎదుట స్వామివారి పాద ముద్రలున్న శిల భూమిలో దిగి ఉంటుంది.

పండంటి బిడ్డను ప్రసాదించే సంతాన ప్రదాత

పిల్లలు లేని దంపతులకు పండంటి బిడ్డను ప్రసాదించే సంతాన మూర్తిగా కాలభైరవుడు ప్రసిద్ధి చెందాడు. సంతానం లేని మహిళలు చొల్లంగి అమావాస్య రోజున రాత్రి వేళ సముద్ర స్నానం ఆచరించి తడి వస్త్రాలతో స్వామి వారి పాదముద్రలపై పడతారు. అనంతరం అక్కడే నిద్రలోకి జారుకుంటారు. మహిళలకు నిద్రలో స్వామి దర్శనం ఇస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. సంతానం కలిగిన భక్తులు బిడ్డలతో పాటు స్వామిని దర్శించుకుని అరటి గెలను, కొబ్బరి మొక్కను మొక్కుగా చెల్లించుకుంటారు. ఏటా సంతానం కోసం వందలాది మంది మహిళలు వచ్చి స్వామి పాదాలపై పడతారు. కాలభైరవుడి సోదరుడిగా బ్రహ్మేశ్వరస్వామి బ్రహ్మ సమేధ్యంలో పార్వతీ సమేతంగా భక్తులకు దర్శనమిస్తాడు. బ్రహ్మేశ్వరస్వామి భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తారని ప్రతీతి.